# పరిచయం

# డాక్టర్ విజయలక్ష్మి పండిత్



ఆమె నిర్మల మనస్కురాలు
నిత్య సాహితీ పిపాసి.
అభిమాన దరహాసిని
విశ్వ పుత్రిక ఆమె కలం

**నేడు ప్రఖ్యాత సాహితీవేత్త విశ్వ పుత్రిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విజయ లక్ష్మి పండిత్ గారి పరిచయం. వారి మాటల్లోనే విందాం.**

**రాధ:- కుటుంబ నేపథ్యం వివరించండి?**

**విజయలక్ష్మిగారు:** నా పేరు డా.పలవలి విజయలక్ష్మి పండిట్. నేను చిత్తూరు జిల్లా, కలిచెర్ల మా అమ్మమ్మగారి ఇంటిలో పుట్టాను. మా నాన్నగారు పలవలి రామకృష్ణా రెడ్డి మదనపల్లెలో అడ్వకేట్ గా పనిచేశారు. అమ్మ శ్రీమతి పలవలి సుబ్బమ్మ. మేము ఆరుమంది సంతానము. నలుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు.

మా నాన్నగారు తన సంతానం ఆడ, మగ అని తేడా లేకుండా అందరిని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ వరకు చదివించారు. చదువుకు, మంచి సంస్కారం, మానవత్వానికి విలువనిచ్చే అభ్యుదయ వామపక్ష వాది. మా నాన్న గారు సాహితీ ప్రియులు. పుస్తకాలు మా నేస్తాలుగా అలవాటు చేసి, పుస్తక ప్రేమికులుగా పెంచారు. మా అక్క, బావగారు, చెల్లెళ్ళు అందరూ పుస్తక ప్రియులు.

**రాధ:- మీ సాహితీ ప్రస్థానం తెలియజేయండి?**

**విజయలక్ష్మిగారు:** నేను 9వ తరగతిలో చదువుతుండగా "భావకవిత్వం "పాఠ్యాంశంలో ఆ తరం భావకవుల కవిత్వం నన్ను ఎంతగానో ఆకర్షించింది.

నాలో ఉన్న కవితాత్మను నిద్రలేపింది. అపుడపుడు నా భావోద్వేగాలకు ఒక ఔట్లెట్స్ గా కవితలు రాసుకుంటూ ఉండటం అలవాటయి నా ప్రవృత్తిగా మారింది. ప్రచురణకు పంపలేదు.

నా మొదటికవిత "అనుకుంటున్నాను" 1978 ఆగష్టులో "వనిత" మాసపత్రికలో ప్రచురించారు.

నా మొదటి వచన కవితాసంపుటి "మానవత్వమా! ఏదీ నీ చిరునామా?"ను 2005లో కీ.శే. జ్ఞానపీఠ గ్రహీత డా. సి.నారాయణ రెడ్డి గారికి అంకితమిచ్చాను. ఆ నా కవితాసంపుటి స్వీకృతి లేఖలో.., ఆ కవితా సంపుటిలో నా కవితల గురించి "వస్తుతత్వజ్ఞత, లలిత గాఢ భావుకత, అభివ్యక్తి తీవ్రత ముప్పేటలుగా అల్లుకుని వున్నాయి." అని సి.నా.రే గారి ప్రశంసతో నన్ను కవిగా మొట్టమొదట శ్రీ.సి.నారాయణ రెడ్డి గారు పరిచయం చేశారు.

**రాధ :-మీ చదువు ? ఉద్యోగం గురించి తెలియజేయండి?**

**విజయలక్ష్మిగారు:** ph.D. in Education, M.A.in Distance Education, Diploma in Distance Edecation, M.Sc.Botany, M.A. Women studies & Visharad in Hindi.

నేను1978'జూలైలో బిసెంట్ థియసోఫికల్ కాలేజీ, మదనపల్లెలో బోటనీ లెక్చరర్ గా 6 సం|| పనిచేసి, 1984 సెప్టెంబర్‌లో డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (హైదరాబాద్)లో లెక్చరర్‌గా క్యాడర్‌లో.. చేరి అకడమిక్ అడ్మినిస్ట్రేషన్ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యాను.

**రాధ :- మీ రచనా వ్యాసంగం...?**

**విజయలక్ష్మిగారు:** నేనుదాదాపు 50 సంవత్సరాల నుండి తెలుగు సాహితీ రంగంలో వివిధ ప్రక్రియల్లో- వచన కవితలు, గజళ్ళు, హైకూలు, కథలు, అనువాదాలు, విశ్లేషణ వ్యాసాలు రాస్తూ దాదాపు 32 ప్రచురణలు చేశాను. నా కలంపేరు "విశ్వపుత్రిక".

**రాధ :- మీరు ప్రచురించిన రచనలు?**

**విజయలక్ష్మిగారు:**

- ముఖ్యమైన కవితా సంపుటాలు "మానవత్వమా! ఏదీ నీచిరునామా?", "ఆకాశంలో అర్థభాగం", "నా ఆత్మ కళలు" "నా అక్షరాలు", "ఏకత్వ జ్ఞానం", దీర్ఘ కవితలు "ధరిత్రీ విలాపం", "విశ్వపుత్రికను నేను విశ్వశాంతి నా ఆకాంక్ష", "విశ్వపుత్రిక హైకూలు".
- తెలుగు గజళ్ళ సంపుటాలు_4; యోగ రేఖలు, రాగరేఖలు, విశ్వరాగం, హృదయాంజలి" అన్న శీర్షికలతో ప్రచురించాను.
- ఇటీవల ఆ నాలుగు గజళ్ళ హిందీ అనువాద గ్రంథం "విశ్వపుత్రిక గజల్ సంకలన్" అన్న శీర్షికతో ప్రచురించి ఆవిష్కరించడం జరిగింది.
- "Wisdom Of Oneness" అన్న ఇంగ్లీషు ఆంథోలజి.(53 ఇంగ్లీష్ పోయెమ్స్) వెలువరించడం జరిగింది..
- రవీంద్రనాథ టాగోర్ "గీతాంజలి"ని తెలుగులోకి "అపూర్వ గానం" అన్న శీర్షికతో అనువదించి పలువురు ప్రముఖుల ప్రశంసలను పొందగలిగాను...
- "రమ్య ద రోబో", "పేగు బంధం" అన్నవి రెండు కథల సంపుటాలు. 5 కవితా సంపుటాలను హిందీ, ఇంగ్లీషులోకి అనువదింపబడ్డాయి.

**రాధ:- మీరు అందుకున్న ముఖ్యమైన పురస్కారాలు:**

**విజయలక్ష్మిగారు:**

- పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ రచయిత్రి కీర్తి పురస్కారం (2021)
- గీతాంజలి అనువాదం = అపూర్వగానం"కు "గిడుగురామమూర్తి పంతులు భాషా సాహిత్య పురస్కారం (2018)

- కాఫ్లా ఇంటర్నేషనల్ "సాహిత్యగౌరవ్" అవార్డ్ ( Oct.2016) ఇండియా ఇంటర్ కాంటినెంటల్ కల్చరల్ అసోసియేషన్) నుండి
- అమృతలత జీవన సాఫల్య పురస్కార(విద్యారంగం) మే.. 2023,
- సి.నా.రె.పురస్కారం కళానిలయం సాహిత్య సేవా సంస్థ వారి (జూలై 2024)
- "కొలకలూరి ఇనాక్ సాహితీ పురస్కారం" నా కవితా సంపుటి "నా అక్షరాలు" కు ( 2024)
- "అరికపూడి పూర్ణచంద్రరావు" మహిళా మణి పురస్కారం (మార్చ్ 2019)
- "భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్" వారి "అనువాద శిరోమణి" పురస్కారం
- సెప్టెంబర్-2024, మొత్తం 20కి పైన పురస్కారాలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నా.

**రాధ:- మీకు ఇష్టమైన సాహితీ ప్రక్రియలు?**

**విజయలక్ష్మిగారు:** కవితలు, గజళ్ళు, హైకూలు, కథలు మొదలగు సాహితీ ప్రక్రియలలో అనేక రచనలను ప్రచురించినా నాకిష్టమైన, మనసును దోచుకునేది కవితా ప్రకియ, గజల్ ప్రకియలు. మనసులో నిరంతరం మెదిలే భావోద్వేగాలను వెంటనే అక్షరీకరించడానికి అనువైన ప్రక్రియలు. కథలు,నాటికలు, నవలలకు ఓ ప్రణాళిక అవసరం కదా.!

**రాధ:- ఈ తరం కవులను గురించి?**

**విజయలక్ష్మిగారు:** ప్రస్తుతం చాల మంది యువ కవులు, కవయిత్రులు మాత్రమే కాక, పదవీవిరమణ చేసిన, స్త్రీ పురుషులు, గృహిణులు కవితలు రాసుకొచ్చి మన సాహితీసభలు, కవిసమ్మేళనాలలో కవితాగానం చేయడం ఓ శుభ పరిణామం.

మనిషి తనలో చెలరేగే భావోద్వేగాలను అక్షర రూపంలో పెట్టడం వల్ల, వారు మానసిక శాంతిని ఉత్తేజం పొందడమే కాకుండా వారు క్రమంగా కవిత్వంలోని మెలకువలను నేర్చుకుంటారు.

ప్రతి కవి, కథకులు రాసిన కవితలు,కథలు వారిని గురించిన ఆలోచనలు,వారి అనుభవాలు, ఆశలు, ఆశయాలకు ప్రతీకలు. కవుల కథకుల కాలం నాటి సమాజపు అక్షర రూప చరిత్రలు.

**రాధ:- ఈ తరం యువతకు మీ సందేశం?**

**విజయలక్ష్మిగారు:** మన మాతృభాష తెలుగును నేర్చుకుని, ప్రతి యువకుడు, యువతి తమ భావాలకు కవితలు కథలుగా అక్షరరూపమిచ్చి తమ ఉన్నత భావాలను జీవిత అనుభవాలను, కొత్త భావాలను, సందేశాలను ఇతర సాంఘిక, సాంస్కృతిక సమూహాలతో పంచుకుంటూ రాబోయే తరం ఒక బృహత్ సాహితీ సమూహంగా ఆన్ లైన్ & ఆఫ్ లైన్ లో, సమాజానికి ఒక దిశా నిర్దేశం చేస్తుందన్నది అక్షర సత్యం.

**ఇది మన డాక్టర్ విజయలక్ష్మి పండిట్ గారి పరిచయం**

**డా. రాధా కుసుమ**